సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024

ఒంటిమిట్ట కోదండరామయ్య కల్యాణ మహోత్సవంలో మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకుడు →



▶▶ గజేంద్రుడిపై జగదభిరాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం తర్వాత స్వామివారు గజవాహనంపై విహరించారు.అంతకు ముందు ఉదయం 7 నుంచి 9గంటల వరకు శివధనుర్భంగాలంకారంలో రాములోరు భక్తులకు దర్శనం ఇచ్చారు. చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం జరిగింది.బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు రథారోహణం, 10:15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రథోత్సవం నిర్వహిస్తారు.



శివధనుర్భంగాలంకారంలో రామయ్య



సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన లక్షలాది భక్తజనం

చూచు వారలకు చూడ ముచ్చట

భక్తుల రామనామ సంకీర్తనలు.. పండితుల చతుర్వేద పఠనం..మంగళవాయిద్యాల నడుమ.. సోమవారం సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు హస్త నక్షత్రయుక్త శుభలగ్నంలో దశరథ మహారాజు తనయుడు శ్రీ రామచంద్రమూర్తి , జనకుని గారాల పట్టి.. నునుసిగ్గుల మొలక సీతమ్మను పరిణయమాడాడు. కమనీయం..రమణీయమైన ఈ సుందర దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో తడిసిముద్దయ్యారు.

- కమనీయం..దాశరథి కల్యాణం
- ఏకశిలానగరిలో పండు వెన్నెలలో రాములోరి కల్యాణం
- కనులారా వీక్షించిన చంద్రుడు
- పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన రామనామం

ఒంటిమిట్ట: లోక కళ్యాణార్థం జగమేలే వైకుంఠ రాముని జగత్ కళ్యాణం ఆంధ్రభద్రాద్రి ఏకశిలానగరి ఒంటిమిట్టలోని జగదభిరాముడి దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. కోదండ రామయ్య సీతమ్మవారిని పరిణయమాడిన వేళ శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది. ఒంటిమిట్ట కోదండ రాముడి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున సతీసమేతంగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలోని మూల మూర్తులకు రాష్ట్ర స్పెషల్ సీఎస్ కరికలవల్లన్ కల్యాణ వేదిక వద్ద ఉన్న కల్యాణ దంపతులైన సీతారాములకు ముత్యాలతలంబ్రాలు, పట్టువస్త్రాలు సంప్రదాయం ప్రకారం స్వామి వారికి సమర్పించారు.

సంప్రదాయం.. ఎదుర్కోలు ఉత్సవం

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సీతారామచ్రందులకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. ఉత్సవ వరులను పల్లకీపై కొలువు తీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తుల జయజయ ధ్వనాలతో శిల్పకళా శోభితమైన కళ్యాణ మండపం వద్దకు తీసుకు వచ్చారు. వేదిక పైన రంజిత సింహాసనంపై కళ్యాణ మూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం పూజా సామగ్రిని సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా విశ్వక్షేన పూజ నిర్వహించారు. 'కర్మణ్యేపుణ్యాహవచనం' అనే మంత్రంతో మండప శుద్ధి జరిపి కళ్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ముంజానకీ ప్రథమం అనే మంత్రం జపిస్తూ వేద పండితులు స్వామి వారికి ఎదురుగా సీతమ్మను కూర్చో పెట్టి కన్యావరణ జరిపించారు. మోక్ష బంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణం చేశారు. అనంతరం ఆశీర్వచనం, పాద ప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి, వర పూజ చేశారు. బంగారు ఆభరణాలను సీతమ్మకు అలంకరించి సకలోపచారాలు చేశారు. మధుపర్కపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించగా నును సిగ్గుల మొలకైన సీతమ్మ నొసటన కళ్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్పెషల్ సీఎస్ కరికాలవలవన్ సమర్పించిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ధరించి పెళ్లికూతురిగా ముస్తాబైంది. అమెకు ఏ మాత్రం తీసిపోని విధంగా శివధనుస్సు విరిచిన శ్రీరామచంద్రమూర్తి అదే రీతిలో సర్వాభరణ భూషితుడై సీతమ్మ ఎదుట కూర్చున్నాడు. తరువాత లోక క్షేమం కోసం మహా సంకల్పం పఠించి కణ్యాదానం, గోదానం చేశారు. సీతమ్మకు రామయ్యకు చెరో 8 శ్లోకాలతో మంగళకాష్టం చదివారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల చతుర్వేద పఠనం భక్తుల రామనామ ధ్వనుల మధ్య హస్త నక్షత్రయుక్త శుభలగ్నంలో సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరిదేవి, సరస్వతి దేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆహ్వానించి సకల మంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తూ లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత, శ్రీ మహాలక్ష్మీ స్వరూపిని సీతాదేవికి శాస్త్రోక్తంగా మంగళసూత్రాధారణ నిర్వహించారు. ప్రభుత్వం తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కళ్యాణ మూర్తుల శిరస్సుపై వేసి కనుల పండువగా కళ్యాణం జరిపారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహాదాశీర్వచనం నిర్వహించి హారతి ఇవ్వడంతో కళ్యాణ క్రతువు ముగిసింది.

- స్వామి వారి కల్యాణాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్‌తోపాటు టీటీడీ యంత్రాంగం, జిల్లా ఉన్నతాధికారులు, ప్రముఖులు, లక్షలాది మంది భక్త జనం వీక్షించారు.



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న స్పెషల్ సీఎస్, టీటీడీ ఈఓ



కల్యాణాన్ని వీక్షిస్తున్న ప్రముఖులు, అధికారులు



కల్యాణ దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితులు



కీర్తనలను ఆలపిస్తున్న సంగీత కళాకారులు

నాలుగోరోజు నామినేషన్ల జోరు

- మొత్తం 44 నామినేషన్లు దాఖలు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాల్గవరోజైన సోమవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో కడప లోక్‌సభ స్థానానికి ఆరు నామినేషన్లు రాగా, ఏడు అసెంబ్లీ స్థానాలకు 38 నామినేషన్లు దాఖలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.

కడప లోక్‌సభ: కడప లోక్‌భ స్థానానికి కుంచెం వెంకట సుబ్బారెడ్డి రాయలసీమ రాష్ట్ర సమితి అభ్యర్థిగా ఒకటి, ఇండిపెండెంట్‌గా ఒక నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షర్మిల తరపున మూడు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తరపున వేణుగోపాల్ ఒకటి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఖాజా హుసేన్ ఒకటి, ఇండిపెంట్ అభ్యర్థిగా వెంకట సుబ్బారెడ్డి రెండు నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీలకు...

బద్వేలు: కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్‌డీ విజయజ్యోతి ఒక సెట్, వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా దాసరి సుధ ఒక సెట్, సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా వెంకట సుబ్బరాయుడు ఒకటి, బీజేపీ అభ్యర్థిగా రోశన్న ఒకటి, బీజేపీ అభ్యర్థిగా అరుణరాజి ఒకటి, ఇండిపెండెంట్‌గా మల్లికార్జున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

కడప: రీఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సుబ్రమణ్యం ఒకటి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా అలీషేర్ ఒకటి, నేషనల్ మహా సభ అభ్యర్థిగా పట్టుపోగుల పవన్‌కుమార్ ఒకటి, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా అవ్వారు మల్లికార్జున నామినేషన్ దాఖలు చేశారు.



బద్వేలులో దాసరి సుధ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తదితరులు

పులివెందుల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరపున ఒకటి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా దాసరి రవిశంకర్ ఒకటి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గవిరెడ్డి రామేశ్వర్‌రెడ్డి ఒకటి, బహుజన సమాజ్ పార్టీ తరపున బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒక నామినేషన్ దాఖలు చేశారు.

కమలాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి.రవీంద్రనాథ్‌రెడ్డి రెండు సెట్లు, ఇండిపెండెంట్‌గా నర్రెడ్డి కిశోర్‌రెడ్డి ఒకటి, సీపీఐ తరపున గాలి చంద్ర ఒకటి, కాంగ్రెస్ అభ్యర్థిగా పాముల బ్రహ్మానందరెడ్డి ఒకటి దాఖలు చేశారు.

జమ్మలమడుగు: ఇండిపెండెంట్‌గా రామేశ్వర్ రెడ్డి ఒకటి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి రెండు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా క్రాంతి ప్రియ ఒకటి, ఇండిపెండెంట్‌గా ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఒకటి, ఇండిపెండెంట్‌గా రామాంజనమ్మ ఒకటి, ఇండిపెండెంట్‌గా వెంకట సుబ్బారెడ్డి ఒక నామినేషన్ దాఖలు చేశారు.

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఒకటి, బీఎస్పీ అభ్యర్థిగా సుబ్బరాయుడు ఒకటి, కాంగ్రెస్ అభ్యర్థిగా మహమ్మద్ నజీర్ ఒకటి, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా సురేష్‌బాబు ఒక నామినేషన్ దాఖలు చేశారు.

మైదుకూరు: తెలుగుదేశం పార్టీ తరపున పుట్టా సుధాకర్ ఒకటి, పుట్టా రవికుమార్ యాదవ్ ఒకటి, వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురామిరెడ్డి ఒకటి, బీఎస్పీ తరపున డీఎస్ జయరాం ఒకటి, ఇండిపెండెంట్‌గా ఆవుల వెంకట రమణ ఒకటి, బీఎస్పీ అభ్యర్థిగా డీఎస్ కల్యాణ్ ఒకటి, కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు ఒకటి, జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా లెక్కల శ్రీనివాసులురెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.



కమలాపురం: ఆర్‌ఓ గణేష్ కుమార్‌కు నామినేషన్ పత్రాలుఅందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డి



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

టెన్త్‌లో తీన్‌మార్

- 92.10 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 3వ స్థానం
- గతేడాది కంటే ఒక స్థానం ముందుకు
- జిల్లావ్యాప్తంగా 27729 మందికిగాను 25538 మంది పాస్
- గతేడాదికంటే 12.67 శాతం పెరిగిన ఉత్తీర్ణత
- వందశాతం ఉత్తీర్ణత సాధించిన 200 ప్రభుత్వ పాఠశాలలు



సంవత్సరం	పరీక్షలు రాసిన విద్యార్థులు	పాసైన వారు	పాస్ శాతం	రాష్ట్రంలో స్థానం
2017-18	35660	34008	95.37	10
2018-19	36536	33943	92.90	11
2019-20	37,600	37600	100	-
2020-21	37955	37,955	100	-
2021-22	38035	27018	71.03	06
2022-23	27097	21524	79.43	04
2023-24	27729	25538	92.10	03

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరిసింది. గతంతో పోల్చితే ఓ స్థానం ఎగబాకి మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఉత్తీర్ణతశాతం కూడా మెరుగైంది. గతేడాది 79.43 శాతం ఉండగా ఈ ఏడాది 92.10 శాతం పెరిగింది. అంటే గతేడాది కంటే ఈఏడాది 12.67 శాతం పెరగడం విశేషం. జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా విద్యాశాఖ అధికారులు చాలా పకడ్బందీగా పది పరీక్షలను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 153 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన పది పరీక్షలకు 27729 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా ఇందులో 25538 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ప్రభుత్వ మ్యానేజ్‌మెంట్‌కు సంబంధించి ఏపీ మోడల్ స్కూల్స్ 99.61 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో మొదటిస్థానంలో నిలువగా బీసీ వెల్ఫేర్ 99.05 స్థానం సాధించి ద్వితీయస్థానంలో, ఏపీ రెసిడెన్సియల్ స్కూల్స్ 98.72 శాతం ఉత్తీర్ణత సాధించి తృతీయస్థానంలో నిలిచాయి.

మేనేజ్‌మెంట్	పరీక్షలు రాసినవారు	పాస్	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	768	650	84.64
బీసీవెల్ఫేర్	210	208	99.05
ప్రభుత్వ	707	590	83.45
కేజీబీవీ	613	593	96.74
మున్సిపాలిటీ	1776	1425	80.24
మోడల్‌స్కూల్స్	254	253	99.61
ఏపీ రెసిడెన్షియల్	156	154	98.72
సోసియల్ వెల్ఫేర్	839	816	97.26
ట్రైబల్ వెల్ఫేర్	99	93	93.94
జెడ్పీ	9389	8147	86.77
ప్రైవేటు	12918	12609	97.61

ప్రభుత్వ చొరవతోనే..

రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలకు నాడు -నేడు కింద సకల సౌకర్యాలను సమకూర్చింది. విద్యార్థుల చదువు కోసం అవసరమైన అన్ని రకాల వస్తువులను విద్యాకానుక పేరిట సకాలంలో అందించింది. దీంతోపాటు పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించింది. అలాగే అమ్మ ఒడిని అందించింది. దీంతో పిల్లలు ఏ చీకూచింత లేకుండా చదువుకున్నారు. పది ఫలితాలను అదరగొట్టారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలను సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమకూరిన వసతుల కారణంగా ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగిందని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికలదే హవా..

ఈ సారి ఫలితాల్లోనూ బాలురపై బాలికలే పై చేయి సాధించారు. జిల్లావ్యాప్తంగా 14214 మంది బాలురు, 13515 మంది బాలికలు పరీక్ష రాశారు. వీరిలో బాలురు 12929 మంది పాసై 90.96 శాతం ఉత్తీర్ణతను సాధించగా.. బాలికలు 12609 మంది పాసై 93.3 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

22255 మందికి ప్రథమస్థానం: పది పరీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 27729 మంది విద్యార్థులు పరీక్షను రాయగా ఇందులో 25,538 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 22255 మంది విద్యార్థులు ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించగా 2378 ద్వితీయస్థానంలో ఉత్తీర్ణతను సాధించారు. అలాగే మరో 905 మంది తృతీయస్థానంలో నిలిచారు.

సంతృప్తికర ఫలితాలు



పది ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌జిల్లా 3వ స్థానంలో నిలిచింది. గతేడాదికంటే ఒక స్థానం ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. రాబోయే ఏడాది ఈ ఫలితాలను మరింత ముందుకు తీసుకెళ్తాం. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు ప్రత్యేక తరగతులు, నిత్యం పరీక్షల నిర్వహణతోనే ఈ ఫలితాలను సాధించాం. – మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

నిరంతర పర్యవేక్షణతోనే..



పదవ తరగతికి సంబంధించి నిరతరం కృషి పర్యవేక్షణతోనే ఈ ఫలితాలను సాధించగలిగాం. ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను ఇవ్వడంతోపాటు విద్యార్థుల్లో అభ్యసనాలను మెరుగుపరచడంతోనే ఈ ఫలితాలను సాధించగలిగాం. రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచినందుకు సంతృప్తికరంగా ఉంది. – ఎద్దుల రాఘవరెడ్డి, పాఠశాల విద్య ఆర్‌జేడీ

పది ఫలితాల్లో ప్రతిభ

పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభకనబరిచారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అంద జేయడంతో పాటు విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారు. దీంతోపాటు తల్లిదండ్రుల ప్రత్యేక పర్య వేక్షణతో పట్టుదలతో చదివిన పిల్లలు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన మార్కులతో సత్తా చాటారు. ప్రతిభచూపిన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు మార్కుల పరంగా భళా అనిపించారు. జిల్లాలో 200 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి. ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జశ్వంత్‌కుమార్‌రెడ్డి 577 మార్కులు సాధించాడు. అదే పాఠశాలలో శ్రవంతి 570, హర్షిన్ 565 మార్కులు సాధించారు. ఎర్రగుంట్ల బాలికల పాఠశాలలో మేఘన 563, గులాబ్‌చాంద్ 556 , బాలుర పాఠశాలలో మంజుల యోగీశ్వర్ 561, అబ్దుల్ రఫీ 552 , ఎర్రగుంట్ల మండలం చిలమకూరు జెడ్పీ హైస్కూల్లో సునీతకుమారి 516 మార్కులను సాధించారు.

- మైదుకూరు బాలికల పాఠశాలలో శ్రావణి ధన లక్ష్మి 588, బాలుర పాఠశాలలో బ్రహ్మసాగర్ 560, యోగీంద్రకుమార్ 555, జీవీసత్రం జెడ్పీ హైస్కూల్లో శ్రీనివాసులు 530, లెక్కలవారిపల్లె జెడ్పీ హై స్కూల్లో వెంకట అశ్విని 530, వనిపెంట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సమీరా 587, శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్లో యశ్వంత్ 558, అనుషాదేవి 558, మైదుకూరు పూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన దీక్షిత 578 మార్కులను సాధించారు.
- చాపాడు మండలానికి సంబంధించి అన్నవరం జెడ్పీ హైస్కూల్లో సిద్దిక్ 539, చాపాడు జెడ్పీ హైస్కూల్లో కావ్య 537, లక్ష్మిపేట జెడ్పీ హైస్కూల్లో వీరరాజేష్ 529 మార్కులను సాధించారు.
- పెండ్లిమర్రి మండలంలో గంగనపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చంద్రకళ 573 మార్కులు సాధించింది.
- పెద్దముడియం మండలం పెద్ద పసుపుల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శ్రవంతి 576, ఉదయ శ్రీ 572, కేజీబీవీకి చెందిన అక్ష్య 569 మార్కులు సాధించారు.
- చక్రాయపేట మండలానికి సంబంధించి నాగుల పల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జస్వంత్ 585 , అంజలి 583, అబ్బాస్ 581 మార్కులను సాధించారు.
- కాశినాయన మండలంలో వెంకట ఇందు 571, శ్యామ్‌కుమార్ 566 మార్కులను సాధించారు.
- ముద్దనూరు మండలం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తుమ్మలూరు అజంత 590 మార్కులను సాధించింది. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన



టి.అజంత

శివమణి 578, నందిని 572 మార్కులు సాధించారు. ఈ పాఠశాలలో 20 మందికిపైగా విద్యార్థినులు 500 మార్కులు అధిగమించారని హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. మండలంలో 94.34 శాతం ఉత్తీర్ణత పొందినట్లు ఎంఈఓలు సుబ్బారావు, నాగేశ్వరరావు నాయక్ తెలిపారు.
- చెన్నూరు మండలం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తస్లీమ బాను 566, కొండపేట హైస్కూల్‌కు చెందిన ప్రత్యూష 544, రామనపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శివ మనోజ్ఞ 549 మార్కులను సాధించారు.
- బద్వేల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జస్వంత్ 586 మార్కులను సాధించారు.
- గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెంచలకార్తీక్ 560 మార్కులు సాధించాడు. పెంచలకార్తీక్‌ను హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా పది ఫలితాల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రఘురాములు తెలిపారు.



పెంచలకార్తీక్

- దువ్వూరు మండలంలోని మాచనపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గడ్డం సుమిత్ర 588 మార్కులు సాధించింది. మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల్లో 265 మంది పరీక్షలు రాయగా 244 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా పుల్లారెడ్డి పేట జెడ్పీ హైస్కూల్, గుడిపాడు జెడ్పీ హైస్కూల్, పుల్లారెడ్డి పేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు.



గడ్డం సుమిత్ర

- రాజుపాళెం మండలంలోని వెలవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్‌అర్ఫా 540 మార్కులు సాధించింది. మండల వ్యాప్తంగా 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రామస్వామి రెడ్డి తెలిపారు. బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో కె.సాయిప్రియ 537 మార్కులు, ఐ.శృతి 531 మార్కులు సాధించింది.



అల్ అర్ఫా

కడపలో..

కడప ఎడ్యుకేషన్ : కడప మండల పరిధిలోని మున్సిపల్ హైస్కూల్ మొయిన్ పాఠశాలకు చెందిన లోకేష్ 581 మార్కులు, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ బాలికల పాఠశాలకు చెందిన అలక నందన 581 మార్కులు సాధించారు. రామాంజనేయపురం ఏపీఆర్ఎస్ ఉర్దూ పాఠశాలకు చెందిన ముక్కరంఖాన్ 580, నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ప్రభంజలి 580 మార్కులు, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌కు చెందిన ఆషియాఖానం 577 మార్కులు సాధించారు.



581 మార్కులు సాధించిన లోకేష్‌తో హెచ్ఎం నాగమణి



ముక్కరాంఖాన్ ,580 మార్కులు



ప్రభంజలి, 580 మార్కులు

లారీ డ్రైవర్ ఇంట చదువుల ముత్యం



జాయిద్‌కు స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ ఖదీర్, గౌసియా దంపతుల కుమారుడు మహమ్మద్ జాయిద్ టెన్త్‌లో 586 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. విద్యార్థి స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రప్పతోపాటు తల్లిదండ్రులు ఆ విద్యార్థిని అభినందించారు. ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి చరణ్‌తేజ 572 మార్కులు సాధించాడు.

వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 100 శాతం ఫలితాలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల పదోతరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాల నుంచి 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 33 మంది ఫస్ట్‌క్లాస్‌లోను, ఒకరు సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులు కావడం విశేషం. పాఠశాల విద్యార్థిని ఎస్. రిచిత 573 మార్కులు, జి. శ్రీలక్ష్మి 560, కె. అనూరాధ 555, వి.హేమలత 553తో పాటు పలువురు విద్యార్థినులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరావు అభినందించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన వివాహిత జాగిరిమున్ని (36) తన ఇంట్లో ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. వారి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మున్నికి గత 18 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన పీరావలితో వివాహమైంది. భర్త కువైట్‌లో పనిచేసేవాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. భార్యభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. అయితే ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆమె ఉరి వేసుకుని మృతిచెందింది. కాశినాయన ఏఎస్ఐ రమణ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఉరి వేసుకుని మృతిచెందిన మున్ని

కౌన్సిలర్ అనుమానాస్పద మృతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీకి చెందిన 4వ వార్డ్ కౌన్సిలర్ జ్ఞాన ప్రసూన (32) సోమవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణానికి చెందిన వంగల నాగేంద్ర కుమార్తె అయిన జ్ఞాన ప్రసూన వివాహం అయినప్పటి నుంచి తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉంటోంది. అప్పుడప్పుడు జమ్మలమడుగుకు వస్తూ ఉండేది. కాగా సోమవారం రాత్రి కోయంబత్తూర్‌లోని ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



జ్ఞాన ప్రసూన (ఫైల్)

ఘనంగా ప్రారంభమైన ఉరుసు



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. దర్గా పీఠాధిపతి (ముతవల్లి), సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, అశేష భక్త జన సందోహం నడుమ ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. గంధం ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో నషాన్ జెండాను ఊరేగింపుగా తీసుకు వచ్చారు. జెండా ఊరేగింపు తాళిం, మార్కెట్, చౌక్ సెంటర్ మీదుగా దర్గాకు చేరుకుంది. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన బాణా సంచా పెద్ద ఎత్తున పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం నషాన్ జెండాను దర్గా ఆవరణంలో ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ ఉరుసు ఉత్సవాల ప్రారంభానికి సూచిక. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనుల సమక్షంలో హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, దస్తగిరిషా ఖాద్రి, మౌలానా మౌల్వి మొహిద్దీన్ షా ఖాద్రి, హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రిల మజార్లపై పూల చాదర్‌లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి టి. హుసేన్ మియా కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు గంధం : మంగళవారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి ప్రముఖ ఖవ్వాల్‌ల మధ్య గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు.

గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం:

ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం అని పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరుసు ఉత్సవాల్లో గంధోత్సవం అతి ముఖ్యమైన ఘట్టం అని, ఈ ఘట్టాన్ని భక్తులందరూ తప్పక వీక్షించాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ



చదిపిరాళ్లలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సాయినాథశర్మ



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

కమలాపురం : కమలాపురం మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 240 కుటుంబాలు చేరాయి. సోమవారం మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో నియోజకవర్గ నాయకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ వెంకట సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, టీడీపీ తరపున గెలిచిన ఒకే ఒక వార్డు మెంబర్ ఆంజనేయులు, భాస్కర్ తదితర 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. అలాగే సింగిల్ విండో అధ్యక్షుడు చల్లా మునీంద్రారెడ్డి, ఎంపీటీసీ జయ సుబ్బారెడి, సర్పంచ్ చిన్ని ఆధ్వర్యంలో సుబ్బరాయుడు, విజయ, స్టీవన్, మనోహర్, జాన్, ప్రసాద్, జార్జి తదితర 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అలాగే కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని వికలాంగుల కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకురాలు డి.సరోజమ్మ ఆధ్వర్యంలో ఉత్తమయ్య తదితరులు 40 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి 240 కుటుంబాలను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సంక్షేమం కోసం జగనన్న ఇప్పటికి 130 సార్లు బటన్ నొక్కారని, మీరు కేవలం రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కితే చాలన్నారు. సాయినాథ శర్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి శాంతి కోరుకునే వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, క్రిష్టారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, నిఖిల్‌రెడ్డి, దేవదానం, జెట్టి నగేష్, బాబు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

మైదుకూరు : మండలంలోని పప్పనపల్లెకు చెందిన 40 కుటుంబాల వారు సోమవారం టీడీపీని వీడి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పప్పనపల్లెకు చెందిన పాలూరు ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఇల్లూరు యోహాన్, ఇల్లూరు పెద్ద వెంకటేష్, ఇల్లూరు వెంకటేష్, పసల యోహాన్, పసల పుల్లన్న, శ్రీపతి ఓబన్న, శ్రీపతి సుబ్బరాయుడు, పసల వరప్రసాద్, చిత్తరాల జార్జి, కామనూరు చిన్న వీరయ్య, పసల కమలాకర్, పిల్లి బాలయ్య, ప్రసన్న కుమార్, వెంకటయ్య, ప్రేమ్ కుమార్, రామయ్య, నవీన్, చంద్ర తదితర 40 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

40 కుటుంబాలు చేరిక

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని పలు గ్రామాల్లో 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం మైలవరం మండల కేంద్రంలో నక్కా శ్రీనివాసులు, తలారి గురప్ప, భార్గవ్, భీముడు నాయక్‌లతో కలిపి 20 కుటుంబాలు చేరాయి. అలాగే చిన్న కొమెర్ల గ్రామంలో కె. భరత్‌రెడ్డి, కె. వెంకటసుబ్బారెడ్డి, కె. గోపాల్‌రెడ్డి, కె.బి. వెంకటసుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, జయరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, పెద్ద కృష్ణారెడ్డిలతో కలిపి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సంబటూర్ ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నారపురెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, నాయకులు దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.